సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



ప్రకృతి ఒడిలో సరస్వతీ నిలయం

ఎటుచూసినా ప్రకృతి అందాల మధ్య ఎత్తయిన ప్రదేశంలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. దీనిని లకేపుట్టు సమీపంలో రూ.20 కోట్లతో నిర్మించారు. ఇక్కడ నుంచి ఒకపక్క మత్స్యగెడ్డ అందాలు, మరోపక్క పచ్చని పొలాలు కనువిందు చేస్తున్నాయి. దీనిని ఇటీవల ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. - పెదబయలు

న్యూస్‌రీల్

నేడు, రేపు భారీ వర్షాలు

- చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: జిల్లాలోని కొన్ని మండలాల్లో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి శనివారం తెలిపారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మారుమూల ప్రాంతాలకు నిలిచిపోయిన బస్సులు

- మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తం



కొయ్యూరులో నిలిచిపోయిన మంప - గంగవరం బస్సు

కొయ్యూరు: సీపీఐ మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తమైంది. తనిఖీలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా మారుమూల ప్రాంతాలకు వెళ్లే బస్సులను శనివారం నుంచి నిలిపివేశారు. కొయ్యూరు నుంచి మంప, బందమామిళ్ల, బూదరాళ్ల వెళ్లే బస్సులు కొయ్యూరుకు పరిమితమయ్యాయి. నైట్ హాల్ట్ సర్వీసులను గ్రామాలకు పంపలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

- జీవో నంబరు 85ను రద్దు చేయాలని డిమాండ్



పాడేరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

సాక్షి,పాడేరు: పీజీ కోటాను కుదిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 85ను రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన ఆందోళన శనివారం కొనసాగింది. దీనిలో భాగంగా వారు స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. దీనిలో పాల్గొన్న పలు పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు నల్ల మాస్కులతో మౌన ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.జీవో నెం 85 రద్దుతో పాటు ఏజెన్సీ అలవెన్సులు కూడా అమలుజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సందీప్, కోశాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి, పలు పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ బిందు, డాక్టర్ సత్య, డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ మణిదీప్ పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



ముంచంగిపుట్టులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో శనివారం వారపు సంతలో ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మారుమూల లక్ష్మీపురం, కుమడ, భూసిపుట్టు, రంగబయలు పంచాయతీల నుంచి వచ్చే వాహనాలను, లగేజీ బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలను తెలుసుకుని విడిచిపెట్టారు. జోలాపుట్టు, దోడిపుట్టు నైట్‌హాల్ట్ బస్సులను మంచంగిపుట్టుకు పరిమితం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ మండల కేంద్రంలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వారోత్సవాల నేపథ్యంలో ఆంధ్ర,ఒడిశా సరిహద్దులో తనిఖీలు ముమ్మరం చేశామని ఆయన పేర్కొన్నారు.

బలిమెల భలే..

సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలో అతిపెద్దదైన బలిమెల జలాశయ నీటి మట్టం రికార్డు స్థాయికి చేరింది. దాదాపుగా ఏడేళ్ల తరువాత పూర్తిస్థాయిలో నీరు చేరిందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి. నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నందున ఏడాది పొడవునా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పాదన జరగడం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

- ఏడేళ్ల తరువాత పూర్తిస్థాయిలో నిండిన జలాశయం
- 2018లో 92.152.. ఈ ఏడాది 88 టీఎంసీల చేరిక
- డ్యామ్ భద్రత దృష్ట్యా నీటిమట్టాన్ని తగ్గించిన అధికారులు
- కొనసాగుతున్న వరద నీరు చేరిక
- మూడు జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఉత్పాదనకు అవకాశం
- భారీగా సమకూరనున్న ఆదాయం



బలిమెల జలాశయంలో రికార్డు స్థాయిలో చేరిన నీటి నిల్వలు

మోతుగూడెం: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలు సీలేరు విద్యుత్ కాంప్లెక్సులోని జలవిద్యుత్ ప్రాజెక్ట్‌లకు మేలు చేశాయి. ఈ కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు బలిమెల జలాశయం ప్రధాన ఆధారం. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్ట్ మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు బలిమెల జలాశయంలో చేరుతుంది. ఈ ఏడాది ఈ ప్రాజెక్ట్‌లో రికార్డుస్థాయిలో నీరు చేరింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 94.5 టీఎంసీలు, నీటి మట్టం 1516 అడుగులు. ఏడేళ్ల తరువాత ప్రాజెక్ట్‌లో మళ్లీ భారీ స్థాయిలో నీరు చేరిందని జెన్‌కో అధికార వర్గాలు తెలిపాయి.


- 2018లో 92.152 టీఎంసీల నీరు చేరింది. వరద నీరు చేరిక ఎక్కువగా ఉన్నందున డ్యామ్ భద్రత దృష్ట్యా 2 టీఎంసీల వరదనీటిని దిగువకు విడుదల చేశారు. ఆ తరువాత మళ్లీ ఈ ఏడాది ప్రాజెక్ట్‌లో అంతకుమించి నీరు చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 88 టీఎంసీలు ఉండగా, 1.5 టీఎంసీల వరద నీటిని నాలుగురోజులపాటు దిగువకు విడుదల చేశారు.

వంతెనకు ముంపు లేకుండా..

- ఒడిశాలోని గ్రామాలకు వెళ్లేందుకు రెండేళ్లక్రితం జాన్‌బాయ్ వద్ద ఒడిశా ప్రభుత్వం బ్రిడ్జిని నిర్మించింది. బలిమెల జలాశయంలో 92 టీఎంసీల వరకు నీరు నిల్వచేస్తే ఈ బ్రిడ్జి ముంపునకు గురవుతోంది. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీనివల్ల జలాశయంలో గతంలో కన్నా నాలుగు టీఎంసీల నీటిని తగ్గించాల్సి వస్తోందని బలిమెల ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి.
- ఈ ప్రాజెక్ట్‌లో నీటినిల్వలను ఆంధ్రా– ఒడిశా ప్రభుత్వాలు సమానంగా వినియోగించుకుంటున్నాయి. నీటినిల్వలు తక్కువగా ఉంటే రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలు మేర ఉత్పాదన జరుగుతుంది. నీరు పుష్కలంగా ఉన్నందున రోజుకు 10 గంటల వరకు ఉత్పాదనకు అవకాశం ఉంటుంది. వేసవిలో కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంటుందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.
- బలిమెలలో చేరిన నీరంతా సీలేరు గుంటవాడ జలాశయంలోకి వస్తుంది. అక్కడ విద్యుత్ ఉత్పత్తి అనంతరం డొంకరాయి జలాశయంలో చేరుతుంది. అక్కడ ఉత్పాదన అనంతరం ఫోర్‌బే అండర్ టన్నెల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి చేరుతుంది

నీటి చేరిక ఇలా..

- బలిమెల జలాశయంలో 2019లో 91.121 టీఎంసీలు (2.102 టీఎంసీలు దిగువకు విడుదల), 2020లో 45.121 టీఎంసీలు, 2021లో 56 టీఎంసీలు, 2022లో 60.123 టీఎంసీలు, 2023లో 55 టీఎంసీలు మాత్రమే నీరు చేరింది. దీనివల్ల 2019లో మినహా మిగతా సంవత్సరాల్లో ప్రాజెక్ట్ నీటిని జలవిద్యుత్‌కు పొదుపుగా వాడుకోవాల్సి వచ్చింది.



బలిమెలపై ఆధారపడిన పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

- బలిమెల జలాశయం నుంచి విడుదల అయ్యే నీటిపై సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒకొక్కటి 60 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు పవర్ యూనిట్లు ఆధారపడ్డాయి. దీంతోపాటు డొంకరాయి కేంద్రంలో 25 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఒక యూనిట్, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 460 మెగావాట్లు ఉత్పత్తి చేసే నాలుగు యూనిట్లు ఆధారపడ్డాయి. గత ఆరేళ్లుగా బలిమెల జలాశయంలో నీటినిల్వలు పూర్తిస్థాయిలో లేనందున అవసరాన్ని బట్టి మాత్రమే విద్యుత్ ఉత్పాదన జరిగేది. ఈఏడాది పుష్కలంగా నీరు ఉన్నందున పూర్తిస్థాయిలో ఉత్పాదన జరుగుతుందని జెన్‌కో అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పూర్తిస్థాయి ఉత్పాదనతో భారీ ఆదాయం



బలిమెల జలాశయం పూర్తిగా నిండటం వల్ల పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి గతేడాది కన్నా మంచి ఆదాయం వస్తుంది. వేసవిలోకూడా నిరంతరాయంగా ఉత్పత్తి జరుగుతుంది.

– బాలకృష్ణ, డివిజనల్ ఇంజినీరు, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం

సూపర్ సిక్స్ మోసకారి చంద్రబాబు

- అధికారం చేపట్టి వంద రోజులైనా అమలు చేయని హామీలు
- దగాను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు విమర్శలు
- అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి

పార్వతీపురం టౌన్ (పార్వతీపురం మన్యం జిల్లా): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన మాటపై నిలబడిన దాఖలాలు లేవని, సూపర్ సిక్స్ హామీలిచ్చి ప్రజలను మరోసారి మోసం చేశారని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ఆరోపించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల కూటమి పాలన దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, కుట్రలు, అరాచకాలు, దాడులు, వైఫల్యాలు, రైతులు, మహిళలు, పిల్లలు, నిరుద్యోగులను మోసం చేయడం, నయవంచనతో సాగిందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని టీడీపీ ఎమ్మెల్యేల తీరు కమిషన్ కొట్టు ఖనిజ సంపదను కొల్లగొట్టు అన్నట్లు ఉందన్నారు. గతంలో జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ మొదటి స్థానంలో ఉందని, ప్రస్తుత కూటమి పాలనలో చివరి స్థానానికి పడిపోయిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పోటీ పడాలని, అవినీతిలో కాదన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు పక్క రాష్ట్రం ఒడిశా నుంచి సారాఅక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేవారే లేరన్నారు.

ఆశ్రమాల్లో పరిశుభ్రత తప్పనిసరి



8లో

చంద్రబాబు ఆరోపణలపై సర్వత్రా విమర్శలు

ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని.. నైవేద్యంలో నాణ్యత లేని పదార్థాలు వాడారన్న సీఎం చంద్రబాబు ఆరోపణలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం దురదృష్టకరమని పలువురు వ్యాఖ్యానించారు.

తిరుపతి లడ్డూపై విష ప్రచారం

- అరకు ఎంపీ తనూజరాణి



సాక్షి, పాడేరు: ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు పథకాలు అటకెక్కాయని, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు గత ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలకు కూటమి ప్రభుత్వం తెరలేపిందని అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి విమర్శించారు. అత్యంత పవిత్రమైన టీటీడీని భ్రష్టుపట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైందవ కార్యక్రమాల్లో కాళ్ల షూస్ తీయకుండా పాల్గొనే సీఎం చంద్రబాబు హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ప్రత్యామ్నాయ పదాలుగా కరువు, దుర్భిక్షం నిలిచిపోయాయన్నారు.

నీచ రాజకీయాలు చాలా దారుణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: వేంకటేశ్వరస్వామి, తిరుపతి ప్రసాదంపై సీఎం చంద్రబాబు నీచ రాజకీయాలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. దేవుడి ప్రసాదంపై ప్రభుత్వంలో ఉన్నవారే ఆరోపణలు చేయడం మొదటిసారిగా చూస్తున్నామన్నారు. దీనిపై న్యాయవిచారణకు ఎందుకు ఒప్పుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఎంతో విశిష్టత గల తిరుపతి ప్రసాదాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదన్నారు.చంద్రబాబు చెబుతున్నట్టుగా లడ్డూలో నాణ్యత లోపిస్తే టీటీడీ ఈవో తెలపాలని, టీడీపీ కార్యాలయం నుంచి ప్రకటన రావడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు.

ఘోరమైన వ్యాఖ్యలు సరికాదు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అరకులోయ టౌన్: పవిత్రమైన తిరుపతి ప్రసాదంపై సీఎం చంద్రబాబు ఘోరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇంత నీచమైన రాజకీయం చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ విశిష్టతను కాపాడాల్సిందిపోయి నీచంగా ప్రవర్తించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. స్థాయికి తగట్టుగా మాట్లాడితే గౌరవం ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు ఊసే లేదన్నారు. దీని నుంచి ప్రజలను దారిమళ్లించేందుకు ఇటువంటి దిగజారుడు వాఖ్యలకు చంద్రబాబు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సహకారం

- కలెక్టర్ దినేష్‌కుమార్



స్వచ్ఛత హీ సేవలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేట: రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి సహకారం అందిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని తడిగిరి గ్రామంలో అల్లూరి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మించిన బిర్సాముండా సభావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులు కోరిన విధంగా రహదారులు నిర్మిస్తామని చెప్పారు. గిరిజన గ్రామలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడ్డాకుల తయారీ యూనిట్లు మంజూరుచేస్తామని చెప్పారు. స్పైసెస్ బోర్డ్ అందిస్తున్న వ్యవసాయ ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ముందుగా స్వచ్ఛతా సేవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ రావు, స్పైసెస్ బోర్డ్ సీనియర్ క్షేత్ర అధికారి కల్యాణి, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎఫ్‌వో సీఈవో నాగమణి, సర్పంచ్ రంజిత్‌ఉమార్ పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు విమర్శ



సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని పాడేరు ఎమ్మెల్యే, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందన్నారు.వంద రోజుల పాలనలో ఒక్క హామీని కూడా అమలుజేయలేదని, మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేసిందని మండిపడ్డారు. స్పెషల్ డీఎస్సీ,నూరుశాతం ఉద్యోగాలు కల్పించే జీవో నెం.3 పునరుద్ధరణలోను మోసం చేసిందన్నారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించడం దారుణమన్నారు. వంద రోజుల పాలనంతా వంద అబద్ధాలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసాలపై ప్రజలతో కలిసి శాంతియుత ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల విజృంభణ



పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న జ్వరపీడితులు

- జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి
- జ్వరపీడితులే అధికం
- రోజుకు 600కు పైగా ఓపీ



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రక్తపరీక్షలకు బారులు తీరిన జ్వరపీడితులు

సాక్షి, పాడేరు: వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తాగు నీరు కలుషితమైంది. దీంతో వైరల్, టైఫాయిడ్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. దోమల ప్రభావం ఎక్కువగా ఉండటంతో మలేరియా బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రికి వారం రోజుల నుంచి ఓపీకి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. శుక్రవారం వారపు సంత కావడంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. ఓపీలో 894 మంది వైద్యసేవలు పొందారు. వీరిలో అధిక శాతం జ్వరపీడితులే ఉన్నారు. వీరిలో 61 మంది ఇన్‌పేషెంట్‌గా చేరారు. శనివారం కూడా ఓపి రద్దీగానే ఉంది. మధ్యాహ్నం 2గంటల సమయానికి 603 మంది వైద్యసేవలు పొందారు.వీరిలో 200 మంది జ్వర లక్షణాలతో బాధపడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం నాటికి 290 మంది ఇన్‌పేషంట్లుగా చేరారు. వీరిలో 155మంది రోగులు జ్వరంతో బాధపడేవారే ఉన్నారు. వీరిలో ముగ్గురు డెంగ్యూ, 6గురు మలేరియా జ్వర లక్షణాలతో చికిత్స పొందుతున్నారు.

జ్వరాల నియంత్రణే లక్ష్యం

జిల్లా ఆస్పత్రికి జ్వరపీడితుల తాకిడి అధికంగా ఉండడంతో వైద్యబృందాలను అప్రమత్తం చేస్తున్నాం.మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారి చేయిస్తున్నాం. అనుమానితులకు మలేరియా నిర్ధారణకు రక్తపరీక్షలు చేయిస్తున్నాం. వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ, సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.జ్వరాల నియంత్రణ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

క్లుప్తంగా

ఐదు కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

• మరో ముగ్గురు పరార్



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసు అధికారులు

మారేడుమిల్లి : మండలంలోని గుజ్జుమామిడి వలస జంక్షన్ వద్ద 5 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని, మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ రాము శనివారం తెలిపారు. నిందితులు హోండా షైన్ మోటారు బైక్‌పై తరలిస్తున్న గంజాయిని, సెల్ ఫోన్, మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకొన్నామని ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 25 వేలు ఉంటుందన్నారు. నిందితులు ఒడిశాలోని మల్కనగిరి జిల్లా గుంతవాడ గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి గుంటూరువైపు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

అనంతగిరి(అరకులోయ రూరల్): గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పట్ల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అరకులోయ సీఐ చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు టోకూరు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అనంతగిరి ఆరోగ్య కేంద్రం సిబ్బందితో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు వైద్య సిబ్బందితో చికిత్సలు చేయించారు. సమాజంలో ఆడపిల్లలకు జరుగుతున్న నేరాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఆశ్రమాల్లో పరిశుభ్రత తప్పనిసరి

ప్రతి మూడో శనివారం శుభ్రత పనులు : పీవో అభిషేక్ ఆదేశం

హుకుంపేట: ఆశ్రమ పాఠశాలల్లో మూడవ శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో వి.అభిసేక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాన్ని శ్రమదానంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శ్రమదానంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థుల దుస్తులను ఆదివారం వేడినీటితో ఉతికించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్లి వైద్యం అదించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారి రజని, హెచ్‌ఎం బాలాజీ పాల్గొన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి చర్యలు

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పరిధిలో వన్‌ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. వెలుగు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించి వన్‌ధన్ వికాస కేంద్రాల నిర్వహణ, భవన నిర్మాణాలు, ఉత్పత్తులకు మార్కెటింగ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో 196 వీడీవీకేలు, 8పీవీటీజీ వీడీవీకేలు ఉన్నాయని, వాటన్నింటి బలోపేతానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మూడు లేదా నాలుగు వీడీవీకేలను అనుసంధానం చేస్తూ వీడీవీకే హబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ఉత్పత్తుల సేకరణకు ఇద్దరు సమన్వయకర్తలను నియమించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వీడీవీకేల నిర్వహణకు అవసరమైన యంత్రాలు, భవనాలను సమకూరుస్తామని చెప్పారు. అన్ని హబ్‌లలో ఈ నెలాఖరు నాటికి మిల్లెట్ బిస్కట్లు తయారీ, కొండచీపుళ్ల ఇతర ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభించాలని సూచించారు. ఐటీడీఏ సమావేశాల్లోను వీడీవీకే ఉత్పత్తులను వినియోగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేట ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు

యోగాసనాలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం

యోగాసనాలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాలకు చెందిన పీడీలు, పీఈటీలకు శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీవో అభిషేక్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు నేర్చుకున్న అన్ని యోగాసనాలను పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలన్నారు. యోగాసనాల ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గడంతో ఆరోగ్యకరమైన చదువులకు దోహదం చేస్తుందన్నారు. ధ్యానం, యోగాతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. తాను సివిల్స్ ప్రిపరేషన్‌లో యోగా చేసినట్టు గుర్తు చేశారు. మిగిలిన అన్ని మండలాల వ్యాయామ ఉపాధ్యాయులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం యోగా గురువు, ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయులతో యోగసనాలు చేయించారు. ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

లాభసాటి పంటల సాగుపై ప్రత్యేక ప్రణాళిక

చింతపల్లి: మన్యంలో లాభసాటి పంటల సాగుపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని పరిశోధన స్థానంలో శనివారం ఆత్మ సహకారంతో చింతపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. మన్యంలో రైతులు పండించే వ్యవసాయ, ఉద్యాన, సుగంధ ద్రవ్యపంటలన్నింటికీ దేశవ్యాప్తంగానే కాక అంతర్జాతీయంగానూ మంచి గుర్తింపు ఉందన్నారు.గిరిజనులు పండించే పంటలన్నింటికి సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లాభసాటి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీలు జాహ్నవి, మోహన్‌రావు, శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ శివకుమార్, బయ్యపురెడ్డి, బాలహుస్సేన్‌రెడ్డి, ఉజ్వలారాణి, వ్యవసాయాధికారులు శ్రీనివాసరావు, మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతపల్లి ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి

సమస్యలపై ఉపాధ్యాయుల వినతి

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పర్యటించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ ఉపాధ్యాయ సంఘాలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు తమ సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని ఇచ్చారు. జీవో నంబర్ 3ని పునరుద్ధరించాలని లేక ప్రత్యామ్నాయ ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎమ్మెల్సీకి జిల్లా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ వినతిలో తెలిపింది. ఉపాధ్యాయుల సమస్యలు జీవో 117రద్దు చేసి ఒకే విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు శ్యాంసుందరం, నాయకులు మోస్య, కైలాసం, నాగరాజు, ఆదినారాయణ,రామచంద్రుడు, కళ్యాణి, నాగరాజు, ఆదినారాయణ, రాజేశ్వరి, పడాల్ తదితరలు పాల్గొన్నారు.



జి.మాడుగులలో ఎమ్మెల్సీ చిరంజీవికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఏజెన్సీలో చేతివృత్తిదారులకు ప్రోత్సాహం

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మారేడుమిల్లి: ఏజెన్సీలోని చేతి వృత్తుల వారిని తగిన విధంగా ప్రోత్సహిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం అన్నారు. ఆయన శనివారం మారేడుమిల్లిలో పర్యటించారు. ఇక్కడ కేన్‌తో ఫర్నీచర్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ వృత్తిపై ఆధారపడిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఫర్నీచర్ తయారీలో మరిన్ని మెలకువలు తెలుసుకొనేలా అవసరం అయితే శిక్షణ ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. అదే విధంగా ఇక్కడ తయారయ్యే ఫర్నీచర్‌కు తగిన మార్కెట్ సదుపాయం కలిపిస్తామన్నారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఫర్నీచర్ తయారీకు అవసరమైన కేన్ సేకరణకు అనుమతులు తీసుకొంటామన్నారు.



కేన్ ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న పీవో సింహాచలం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

మారేడుమిల్లి పీహెచ్‌సీను ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల స్టాక్‌ను పరిశీలించారు.ఆస్పత్రి పరిధిలో ఉన్న గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో దగ్ధం

• కాలిపోయిన రూ.లక్ష విలువైన బ్యాగులు



అగ్ని ప్రమాదానికి గురైన ఆటో

సాక్షి, పాడేరు : పట్టణంలోని సినిమా హాల్ సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి అనుమానస్పద రీతిలో ఒక ఆటో అగ్ని ప్రమాదానికి గురైంది. ప్రసాద్ అనే బ్యాగుల వ్యాపారి ఈ ఆటోలో సుమారు రూ.లక్ష విలువ చేసే బ్యాగులను లోడ్ చేశాడు. ఆటోను తన ఇంటి ముందే నిలిపాడు. రాత్రి ఒంటిగంట సమయంలో భారీ పేలుడు శబ్దం రావడంతో పాటు ఆటో నుంచి మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పినప్పటికీ ఆటోతో పాటు బ్యాగులన్నీ దహనమయ్యాయి. ఈ ఘటనపై బాధిత వ్యాపారి ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

27 నుంచి టీటీ ర్యాంకింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. గీతం డీమ్డ్ వర్సిటీలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించి పోస్టర్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉదయం మంచు..సాయంత్రం వర్షం



డుంబ్రిగుడలో శనివారం ఉదయం కురుస్తున్న మంచు



సాయంత్రం కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మంచు దుప్పటి కమ్ముకుంది.. గత మూడు వారాలుగా వర్షాలతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. తెల్లవారుజాము నుంచి మంచు కమ్ముకుంటోంది. మన్యానికి చలికాలం సమీపించినట్టు ప్రకృతి సంకేతాలు తెలియజేస్తోంది. ఉదయం మంచులోనే వారపు సంతలకు గిరిజనులు ప్రయాణమయ్యారు. సాయంత్రం వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. మళ్లీ తుపాను ప్రభావం ఉంటుందేమోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

76 కిలోల గంజాయి పట్టివేత

నలుగురు నిందితులకు రిమాండ్

కె.కోటపాడు: ఆటోలో తరలిస్తున్న 76 కిలోల గంజాయిని ఎ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ పట్టుకున్నారు. మండలంలోని ఆనందపురం కూడలిలో శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా, ఆటో వెనుక భాగంలో పార్సిల్స్ గుర్తించారు. దాన్ని తనిఖీ చేయగా రూ.3.80 లక్షల విలువ చేసే 76 కిలోల గంజాయి లభ్యమైంది. ఆటోలో గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారిలో హుకుంపేటకు చెందిన కోడా నిలీజాన్, పాంగి శ్రీకాదాంబరి, జి.మాడుగులకు చెందిన డి.మరియ, ఎస్.కష్టవేణి ఉన్నారు. గంజాయిని ఆనందపురం మీదుగా సబ్బవరం చేరవేసేందుకు వీరు ఆటోలో ప్రయాణిస్తూ పట్టుబడ్డారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శనివారం తెలిపారు.



ఆనందపురం కూడలి వద్ద ఆటోలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

సైకిల్, బైక్ ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు



పరిస్థితి విషమంగా ఉన్న మోహన్‌పాత్రో



ప్రమాదంలో తీవ్రగాయాలతో ఉదయ్

ముంచంగిపుట్టు: మండలంలో గల దారెల పంచాయతీ వరండాపుట్టు గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురుఎదురుగా వస్తున్న బైకు, సైకిల్ ఢీకొని, ఇద్దరుకు తీవ్రగాయాలయ్యాయి.సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి చెందిన బి.మోహన్‌పాత్రో ముంచంగిపుట్టు వారపు సంతకు వచ్చి తిరుగు ప్రయాణంలో గొడుగులపుట్టు వెళ్తుండగా ఆ సమయంలో సుజనకోట పంచాయతీ వనుగుపుట్టు గ్రామానికి చెందిన వి.మనోజ్‌కుమార్, ఏనుగురాయి పంచాయతీ బోండాపుట్టు గ్రామానికి చెందిన కె.ఉదయ్‌లు ఇద్దరు బైకుపై ముంచంగిపుట్టు వస్తుండగా వరండాపుట్టు మలుపు వద్ద సైకిల్, బైకు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలి, సిబ్బంది వైద్య సేవలు అందించారు.సైకిల్‌పై ప్రయాణించిన మోహన్‌పాత్రో చేయి విరిగిపోగా కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బైకుపై ఉన్న ఉదయ్‌కు సైతం చేతికి గాయాలయ్యాయి. మనోజ్‌కు స్వల్పగాయాలు కాగా, పరిస్థితి విషయంగా ఉన్న మోహన్, ఉదయ్‌లను మెరుగైన వైద్య సేవల నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విధుల్లో గుండెపోటుతో హెచ్‌సీ మృతి



శ్యామ్(ఫైల్)

సాక్షి,పాడేరు: పాడేరు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కంట శ్యామ్(52) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో సహచర పోలీసులంతా హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించినప్పటికీ ఫలితం లేకపోయింది.మృతి చెందిన హెచ్‌సీ అరకులోయ ప్రాంతానికి చెందిన వారు.గత రెండేళ్ల నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు.హెచ్‌సీ శ్యామ్ మృతిపై పోలీసు అధికారులతో పాటు సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కూటూరు కల్వర్టు పక్కన కాలువలో గుర్తించిన మృతదేహం

కూనవరం : మండల పరిధిలోని కూటూరు, ముల్లూరు గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు కింద గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు (40). కల్వర్టు పక్కనున్న కాలువలో పడి ఊపిరాడక చనిపోయి ఉండవచ్చు అని భావిస్తున్నారు. మృతదేహం నాలుగురోజుల క్రితంది కావొచ్చని గిరిజన తెగకు చెందిన కొండరెడ్డి అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వివాహితపై హత్యాయత్నం

ఎంవీపీ కాలనీ(విశాఖ): సీతంపేటకు చెందిన వివాహితపై ఆర్.శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన వివాహిత హెచ్‌బీ కాలనీలో వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. తనతో మాట్లాడాలని బాధిత మహిళను కొంతకాలంగా శ్రీనివాసరావు ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆమె వస్త్ర దుకాణం మూసి ఇంటికి వెళుతుండగా వెంటపడ్డాడు. హెచ్‌బీ కాలనీ దరి స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ వద్ద ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. చాకుతో వెనుక నుంచి పోడవడంతో కేకలు వేసుకుంటూ బాధిత మహిళ పరుగులు తీయడంతో శ్రీనివాసరావు పరారయ్యాడు. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం వెంకోజీపాలెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని శ్రీనివాసరావుపై హత్యయత్నం కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేశారు.